# అధికారి అభిమానం

## -వర్చస్వి ఎల్. పుచ్చా

సుప్రసన్నకుమారికి 8 గంటలప్పుడు సుప్రభాత వేళయింది. విపరీతమైన బద్ధకంగా ఉంటం చేత కనీసం మరో అరగంటయినా అటూ ఇటూ దొర్లి లేస్తే బాగుండుననిపించింది. కానీ కష్టపడి అటూ ఇటూ దొర్లింతర్వాత 'కొత్త సన్‌రైజ్' కాకపోయినా ఓ స్ట్రాంగ్ కాఫీ ఠంచనుగా పడికూర్చోవాలిగా మరి! ఎవరున్నారు?

- ఆయన....!

-లేకపోతే బుల్లి చెల్లి.....!! (అఫ్‌కోర్స్ ఏజ్‌లో కాదు....ఓ ఇరవై ఈజీగా ఉంటాయ్) ఆయన....6 గంటలకే ఎక్కడికో కార్లో వెళ్ళిపోతాడు. చెప్పడం మాత్రం జిమ్ము - క్లబ్బు అంటాడు మరి....ఉంటే మటుకు కాఫీ కలిపి ఇస్తాడా యేం? ఉత్త మేల్ షావనిస్టిక్ పిగ్! బ్లడీ మేల్ డామినేషన్! స్త్రీ - పురుష వివక్ష-షిట్!!

ఇక బుల్లి చెల్లి 'కల్పవల్లి' ఈ మధ్య బాగా ఎదిగిపోతుందననిపిస్తోంది (మానసికంగా కూడా) ఎంచేతంటే-

కాఫీ ఇస్తే గిస్తే - ఇస్తూనే దాంతోపాటు ఓ 'కీ' గూడా ఇస్తోంది- "ఇహ మనకి జన్మలో ఓ 'బాయ్' దొరకదా?" అనిన్నీ..........టిఫిన్ పెడితే గిడితే దాంతోపాటు వాత కూడా పెడుతోంది. "రోజూ ఇలా నీ బాబు టిఫిన్ పెడతాడా? ఏం ఐఏయస్సో ఏమో! పూర్ ఆఫీసర్! సర్వెంట్ ప్రొవైడ్ చేయించుకోడం చేత కాదు"అనిన్నీ! సుప్రసన్నకుమారికి అంతా షేమ్‌ఫుల్‌గా ఉంది. ఏమిటి చేయడం? ఆయనేమో వాళ్ళ క్లబ్బులో కుర్రాణ్ణి ఒకతన్ని పెడితే వెధవ....క్యాష్ బ్యాగ్‌తో సహా పరారయ్యాడు. వేరొకతను రెండు పూటలా తిండి పెట్టి పన్నెండొందలు అడిగాడు - సరే కదా అనుకుంటే చెల్లికి సైటుకొట్టేంత మొనగాడయ్యాడు. హీ వజ్ సమ్మర్లీ డిస్మిస్డ్ ఆన్ దట్ ఈవెంట్ - మరో పనమ్మాయిని పెట్టుకుంటే నా పనులంటే చేసి పెడ్తుంది గానీ 'ఆయన పనులు' కొన్ని చేయడం లేదు. అది చేసినా పరిస్థితులూ అనుభవించాం. ఏదిఏమైనా "మెయిడ్ సర్వెంట్స్ ఆర్ నాట్ బిలీవబుల్ ఆల్వేస్" అనుకుంటూ ఆవిడ్ని కూడా పంపించి వేసింది. ఈ మహా నగరంలో తన మహా హోదాకి తగ్గ సర్వెంట్ లభించడం మహా ఇదిగా ఉంది.

"ఖర్మ! వాంటెడ్ కాలంలో వేయించాలి కాబోలు!" అనుకుంది సుప్రసన్నకుమారి. సదరు కార్య నిర్వాహణకుగానూ స్టెనో కమ్ పియ్యేని ఈ వేళ పురమాయించాలి అనుకుంది.

"నెలకో వెధవని మారుస్తున్నావ్ ఇన్నాళ్టినుంచీ! ప్రతిసారీ వాడేమేం చేయాలో చెప్పి చేయించేసరికి తల ప్రాణం తోకకొస్తుంది. ఐకాంట్ బేర్ దిస్ సింప్లీ! ఈ రోజు నువ్వు ఏదో వెధవని కంపల్సరీ తెచ్చిపెట్టాల్సిందేనే అక్కయ్యా" అంటూ అల్టిమేటం విసిరింది కల్పవల్లి.

"నేనూ ఎవరో ఒక వెధవని పెడుతూనే ఉన్నా కానీ మీ అక్క తిన్నగా చేయించుకుంటేనా? టబ్బులో కూర్చుని వీపుకు సబ్బు కూడా పెట్టాలంటే ఎవడు లేక ఎవతె మాత్రం చేస్తాడు లేక చేస్తుంది చెప్పు! ఏదో కొద్దో గొప్పో పని చేయించుకుని వదిలిపెట్టాలిగానీ" అంటూ సుప్రసన్న భర్త సుడేవిడ్ కూడా లైటర్‌వీన్‌లో ఇంటర్ ఫియర్ అయ్యి ఆనక సుప్రసన్న నేత్రాలు అప్రసన్నంగా అరుణారుణాలవటం చూసి అక్కడ్నించి తప్పుకున్నాడు.

సుప్రసన్న గ్రూప్ 'ఏ' కాడర్‌కి ప్రొబేషన్‌లో ఉంటున్న



రోజుల్లోనే మరో ఫ్రెండ్ ద్వారా లక్షాధికారి డేవిడ్‌తో పరిచయమైంది. షేర్ మార్కెట్ సంద్రాన్ని ఔపోసన పట్టి అలా ఎదిగాడని పేరు ప్రఖ్యాతులున్న డేవిడ్‌తో మొట్టమొదటి చూపులోనే 'డబ్బు'లో పడిపోయింది సుప్రసన్న - అమాంతం తల్లిదండ్రుల్ని కాదని వివాహం చేసుకుని భర్త పేరు ముద్దుగా 'సుడేవిడ్' అని మార్పించుకునేలా ఒప్పించింది. తర్వాత ఉత్పన్నమైన షేర్ మార్కెట్ 'క్రాష్' సుడేవిడ్ తన 'బిజినెస్' వైండప్ చేసుకునేలా చేసింది. అది వేరే కథ! ప్రస్తుత సమస్య "హౌ టూ గెట్ ద సర్వెంట్ ప్లీస్?"

ఆ రోజూ మామూలుగానే ఆఫీసుకు వెళ్ళినా ఆఫీసు పనులేమీ చెయ్యదల్చుకోలేదు సుప్రసన్న. 'సర్వెంట్ సమస్య' ప్రత్యేక అంశంగా తీసుకుని తెగ ఆలోచించి పారేసింది. ఏ ఫైలు 'అర్జంట్' అని పట్టుకొచ్చినా 'నథింగ్ డూయింగ్' అంటూ వారించింది. పియ్యే సర్వోత్తమరావు సుప్రసన్నకుమారిగారి ఆందోళనల్ని తెగ అంచనా వేయ ప్రయత్నిస్తున్నాడు. 'మేడం'ని ఎలా సుప్రసన్నం చేసుకోవాలా అని అనుక్షణం ఆరాటపడిపోయే స్పెషల్ క్రీచర్ సర్వోత్తమరావ్. మేడం దగ్గరికి వెళ్ళి వినయంగా "ఇది బాగా అర్జంట్ ఫైల్ మేడమ్" అన్నాడు.

"ఏ ఫైలైనా ఇవ్వాళ మూడ్ లేదు సర్వోత్తమరావ్‌గారూ! కాంట్ వియ్ సీ టూ ఇట్ టుమారో?" అంది.

"లేదు మేడం! ఇది క్యాజువల్ లేబరర్స్ పేమెంట్‌కి సంబంధించింది! అప్పుడే పది తారీఖులయ్యాయి గదా! పాపం వాళ్ళకి పేమెంట్ ఇప్పించేస్తే........." అంటూ గొణిగాడు సర్వోత్తమ్‌రావు అంతే....!

ఒక మెరుపు మెరిసింది - తర్వాత ఒక ఉరుము వినబడింది! సుప్రసన్న వీల్ ఛెయిర్ గిరుక్కున తిప్పుకుని ముందుకి వంగి ఫైల్ మీద చెయ్యి వేస్తూ -

"ఏమన్నారు? క్యాజువల్ లేబరర్స్‌దా ఈ ఫైలు?" అంది.

ఆ మాత్రం ఎక్స్‌ప్రెషన్ చాలు సర్వోత్తమరావుకి!

మేడంకున్న ఆందోళన్ని ఆమూలాగ్రం చదివిపారేసి - "మేడం! మీరు ఊ అంటే ఉత్తరాది నుంచి గూర్ఖా ఒకతను ఉన్నాడు! గవర్నమెంటు ఉద్యోగం అయితే చాలు! ఎంత పనైనా ఏదైనా చేస్తాను అంటున్నాడు - మీరు దయతలిస్తే మనకి వాటర్‌బాయ్‌లా పెడదాం. తర్వాతర్వాత మీ టిఫిన్ క్యారియర్ అవీ తెప్పించడం..... చేయొచ్చు" అన్నాడు సర్వోత్తమరావ్.

సుప్రసన్నకుమారి సమస్య మంచు విడినట్టు విడిపోయింది - ఒక క్షణం మాత్రమే ఆలోచించింది తనకి కార్యాలయంలో యువ మహిళా ఆఫీసరుగా దక్షత - దాక్షిణ్యం అపారంగా ఉన్న ఆఫీసరుగా డిగ్నిటీ ఆఫ్ లేబర్ పాటించే మహిళామణిగా సంఘ సేవికగా పేరుంది (?) ప్రొపోజల్స్ అమాంతంగా ఒప్పుకుంటే ఎలా?

"చూడండి సర్వోత్తమరావుగారూ? మీరున్నది నన్ను మిస్‌గైడ్ చేయడాన్కి కాదు! క్యాజువల్ లేబర్ రిక్రూట్‌మెంట్ మీద బ్యాన్ ఉన్న విషయం నాకు తెలీదంటారా? అదలా ఉంచితే - మన లంచ్ బాక్స్ మనం తయారుచేసి తెచ్చుకోలేమా? అంతెందుకు? ఈ వారమంతా బాయ్ లేకపోతే క్యాంటీన్ నుండి స్వయంగా బాటిల్‌లో వాటర్ పట్టి తెచ్చుకోవడం మీకు తెలియంది కాదు. ఉన్న వాళ్ళతోనే పని చేయించుకోవాలి. మళ్ళీ కొత్త వాళ్ళెందుకు! చిన్నా చితకా పనులు మనం చేసుకోడంలో తప్పేముంది ఆనందం తప్ప! అదీగాక వీళ్ళందరినీ ఇలా నియమిస్తూ పోతే ఎంతెంత జీతాలు ఇవ్వాలి? బ్యాన్‌కి అర్థం ఏముంది? ఎకానమీ మెజర్స్ ఏం పాటిస్తున్నట్టు? ఐ వోంట్ సబ్‌స్క్రైబ్ దిస్" అని ఉపోద్ఘాతం ఇచ్చారు సుప్రసన్నగారు.

సర్వోత్తమరావ్‌కి ఇవన్నీ కొట్టిన పిండే!

ఒకళ్ళు ఔనన్నట్టు అంటం, మరొహరు 'నో' అన్నట్టు అంటం, మళ్ళీ ఔననిపిస్తున్నట్టుగా నటిస్తు కాదంటం అనేసేక కాదంటూనే ఔననటం చివరికి 'అలాక్కానీ అంటం....! ఈ బాపతు తంతంతా నిర్వహించడంలో ఎంతెంతో ఎదిగిపోయాడు సర్వోత్తమరావ్!

చివరాకరికి మేడమ్ చేత మొహమాటపూరిత 'యస్' అనిపించేశాడు. సుప్రసన్న కూడా "అవున్లే సర్వోత్తమ్! 'గరీబీ హటావో' లాంటి పెద్ద పదాలు చెప్పనుగానీ ఆ కుర్రాణ్ణి పెట్టేసుకుని మనవంతూ దారిద్ర్య నిర్మూలనానికి సవాలుగా తీసుకుని ఉపక్రమించేద్దాం. పాపం! మనం ఇంతిం

త మింగుతాం - అతనికి మింగమెతుకు ఇప్పిస్తే తప్పేమిటి? ఏ చట్టం ఏ న్యాయం అడ్డుపడగలుగుతుంది? మీరన్నట్టు కొంతకాలమైతే 'లాంగ్ స్టాండింగ్' కేసు కింద నోట్ పంపించి పర్మెనెంట్ చేయడం కోసం రికమెండ్ చేద్దాం!" అంటూ ముక్తాయించింది సందర్భానుసారంగా సర్వోత్తం గొంతు కలుపుతూ "తర్వాత్తర్వాత గుమాస్తా గుర్నాధాన్ని రికించేసి ఓ తప్పుడు అప్పాయింట్‌మెంట్ ఆర్డరు ఇప్పించేసి చదీచప్పుడు కాకుండా మ్యాటర్ సెటిల్ చేద్దాం! పైవాళ్ళు ఆరా తీస్తే మాకు తెలీదంటే మాకు తెలీదందాం! పిచ్చెక్కి - వీణ్ణి పీకండి అంటారు. వీడు జీవన భృతి కోల్పోతున్నాడు అంటూ కేసు పెట్టేస్తాం! కొన్నాళ్ళు లాగా లాగి వాణ్ణి - ఓ.కే. పర్మెనెంటెడ్ అంటారు. వాడు మాత్రం మిమ్మల్నే 'ఫుడ్డు దాత సుఖీభవ' అంటాడు. మీరు 'జీవనదాత', 'పేదల పెన్నిధి' 'జీవకారుణ్య' 'దాన తాపత్రయ' ఎట్‌సెటరా బిరుదాంకితులుగా చలామణి అవుతారు" అంటూ వ్యాఖ్యానించి పారేశాడు.

".......లుక్! మీరు మరీ మరీ కోసేస్తున్నారు. అవన్నీ బిరుదుల్లా లేవు! ఏవో ఎల్లైసీ స్కీముల పేర్లలా ఉన్నాయి. ఎనీవే..... మీరు ఈ రెండు రోజుల్లో మ్యాటర్ సెటిల్ అయ్యేలా చూడండి" అంది సుప్రసన్న అప్రసన్నం నటిస్తూ ముసిముసిగా.

"రెండ్రోజులాగీ? షేమ్. ఈ పూటనించే వాడు మీ సేవలో ఉంటాడు. మిమ్మల్నొప్పించగలననే నమ్మకంతోనే వాడికి ఆల్‌రెడీ మీ ఇల్లు చూపించేశాను. మీరు ఇంటికెళ్ళేసరికి మీ లాన్ అంతా వాటరింగ్ చేస్తూ ఉంటాడు చూడండి!" అని....

"అన్నట్టు - ఆ గూర్ఖావాడి పేరు భండారీ. అతి స్వామి భక్తి" అని కూడా అని - అక్కడ్నుంచి లేస్తూ తనక్కావలసిన కీలకమైన ఫైలొకటి సంతకం చేయించుకుని బయటకొచ్చేశాడు సర్వోత్తమ్!

* *

నెలాఖర్లో జీతాలు ఇవ్వటానికి ఎక్విటెన్స్ రోల్స్ ప్రిపేర్ చేస్తున్నాడు గుమాస్తా గుర్నాధం!

"అరె! ఈ భండారీ ఎవరు? అడ్వాన్స్ రిసీట్ పంపించాడు. ఎప్పుడు జాయినయ్యాడు?" అన్నాడు తోటి గుమాస్తా కోటేశంతో...!

"నీకు తెల్దా? రోజూ మేడమ్‌కి క్యారియర్ తెచ్చే కుర్రాడెవరనుకుంటున్నావ్?" అన్నాడు కోటేశం.

"నాకేం తెల్సు? వాళ్ళు పర్సనల్‌గా ఏర్పాటు చేసుకున్న వ్యక్తేమో అనుకున్నా" అన్నాడు గుర్నాధం!

"అక్కడే పప్పులో కాలేశావ్! వాణ్ణి మన ఆఫీసులో నెల క్రితమే పెట్టుకున్నాం. నువ్వు లీవ్‌లో ఉన్నప్పుడు నన్ను పిలిచి ఫైలు తెప్పించుకుని అపాయింట్‌మెంట్ లెటర్ కూడా ఇప్పించింది నా చేత. నీకు చెప్పడం మరిచిపోయాను. అయినా కొంపలు మునిగేంతగా గుర్తుపెట్టుకోవాల్సిన కేసేం కాదుగా ఇది. మేడం దానకర్ణులు. ఎంతో అవసరంలో ఉన్న కుర్రవాణ్ణి అలా సహాయపడి ఆదుకుందిట. నువ్విది తెలుసుకుని మాత్రం ఇప్పుడు వాడి కంచం ముందు అన్నాన్ని కాలితో తంతావా ఏం? - వాణ్ణి బతకనీయ్" అన్నాడు కోటేశం.


"నోఁ - రేపు ఆడిట్‌లో ఇది నా పీక మీదకి వస్తుంది. నేనిప్పుడే వెళ్ళి వద్దని చెప్తా" అంటూ గుర్నాధం మేడమ్ రూమ్ కేసి వడివడిగా నడిచాడు.

* * *

భండారీ, సుప్రసన్న కుటుంబాన్నంతటినీ గుండెల్లో పెట్టి చూసుకుంటున్నాడు. ఇప్పుడు భండారీ లేకపోతే సుప్రసన్న అండ్ కంపెనీకి ఒక్క రోజు జరుగదు.

ఒకరోజు లాన్‌లో ఉయ్యాల ఊగుతూ సుడేవిడ్ - "ఔనూ.....ఇంతకీ భండారీగాడికి నెల జీతం ఎంతిస్తున్నావ్?" అనడిగాడు సుప్రసన్నని.

"....నేనివ్వడమేమిటి? వాడికి డిపార్ట్‌మెంట్ డైలీ వేజస్ కింద 'పే' చేస్తుంది.



నాదగ్గరే ఎందుకు చేయాలనడిగే దమ్ము మా వాళ్ళకెవరికీ లేదు"

"అడిగితే....?"

"గుమాస్తా గుర్నాధానికి పట్టిన గతే పడ్తుంది. వాడికి ఎసీఆర్‌లు చెడగొట్టాను"

"-ఏ కారణం చేత చెడగొట్టావు?"

"ఏముంది? భండారీ దగ్గర పెద్ద మొత్తంలో తిని రూల్స్‌కి విరుద్ధంగా వాణ్ణి అప్పాయింట్ చేయిస్తున్నట్టుగా నాలాటి ఉన్నతాధికారి చేత చేయించి డిపార్టుమెంట్‌ని తప్పుదోవ పట్టించాడు - అంటూ ఆఫీసు గుప్పుమనేలా చేశాను. ఇదే కారణంతో ఏసీఆర్ స్పాయిల్ చేశాను" అంది సుప్రసన్న.

"మరిప్పుడు తెలిసిందిగా! భండారీని తీసెయ్యండి" అంటే? మళ్ళీ అడిగాడు సుడేవిడ్.

"పొట్టకొట్టడం మా అభిమతం కాదు. జరిగిందేదో జరిగిపోయింది. వీణ్ణి పర్మెనెంట్ చేయండి- అంటూ పైవాళ్ళకి అర్జీ పెట్టిస్తాను. బడుగు వర్గాల ప్రతినిధిగా వాళ్ళ సంక్షేమం కోరే అధికారిణిగా నేనూ కేసును స్ట్రాంగ్‌గా రికమెండ్ చేస్తాను. అయితే - సంతోషం! కాకపోతే - భండారీ స్థానంలో మరో డింభకుడు - అప్పటి సంగతి అప్పుడు చూద్దాం" అంది సుప్రసన్న.

సుప్రసన్న డిప్లమసీకి జోహార్లు చెప్పాలో, డిప్లమసీకి మసి పూసిన సుప్రసన్నకు జోహార్లు చెప్పాలో అర్థంగాక తలగోక్కుని అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు సుడేవిడ్.

* * *

గుర్నాధం సెక్షను మారిన చాలా రోజుల తర్వాత భండారీ వెళ్ళి కలిశాడు.

"సాబ్! పానీ పీవో" అంటూ ఓ గ్లాసుతో నీళ్ళిచ్చాడు భండారీ!

"...ఏం పాపం? మా మాట వినని వాడివి ఏకంగా అడిగినట్టు నీళ్ళు తెచ్చిపెడుతున్నావ్?" అడిగాడు గుర్నాధం.

"మాఫ్ కరో సాబ్! నాకు కొంచెం కొంచెం తెల్సింది! మీకు ట్రాన్స్‌ఫర్ నాది కారణమని తెల్సింది"

"ఇప్పుడిదంతా ఎందుకు గానీ - అమ్మగారెలా చూసుకుంటున్నారు?" అడిగాడు గుర్నాధం.

"ఏమో సాబ్! కేసే కేసు అని కింది కోర్టులో పెట్టించారు నన్ను! సంపాదించిన పైసలు ఇక్కడ పెట్టించారు. నాకు నమ్మకం లేదు పర్మెనెంట్ అవుతుందని. మా గ్రామం వెళ్ళి ఏదో పని చూసుకుంటాను..." అంటూ వేళ్ళు నలుపుకుంటూ గుర్నాధాన్ని చూసి...."మీరే మదద్ చేయాలి సాబ్.... షిల్లాంగ్ దగ్గర మావూరు. నాలుగు ఐదు వందలు కావాలి.... మీరే నాకు కొద్దిగా ఇప్పిస్తే అక్కడికి వెళ్ళి మీ పైసలు పంపించేస్తాం. కాదనకండి" అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నాడు భండారీ.

"అదేంటి? మీ మేడమ్ నీకు ఆ మాత్రం సాయం చేయదా? లోగడ నువ్వే 'దేవత' అంటూ భజన చేసేవాడివి గదా?" అడిగాడు గుర్నాధం.

"లేదు సాబ్ - 'పైసలు ఇప్పించేదాన్నే గానీ ఇచ్చేదాన్ని గాదు' - అంటూ వుంటుంది ఎప్పుడూ! సార్ నడిగితే 'మేడమ్'నే అడుగు అంటాడు. మేడమ్ నడిగితే 'రేపేదో మహిళ సంఘ్' వాళ్ళు ఏదో సన్మానం చేస్తున్నారుట. నాకూ ఖర్చులూ అవీ వుంటాయ్. నేను ఇప్పుడు పెద్దగా ఇచ్చుకోలేను' అంటూ దస్ రూప్యా చేతిలో పెట్టింది" అన్నాడు భండారీ.

గుర్నాధం మరో ఇద్దర్ని అడిగి భండారీకి కావల్సిన పైకం ఇచ్చేసి "జాగ్రత్తగా వెళ్ళు" అన్నాడు.

"బహుత్ బహుత్ శుక్రియా సాబ్! నేను వెళ్ళగానే డబ్బులు పంపిస్తాను. మీ మంచి తనం గురించి మేడంకి ఒక ఖత్ రాస్తాను!!" అంటూ వెళ్ళిపోయాడు భండారీ.

తనమీద తను జాలిపడ్డం చేతకాని గుర్నాధం భండారీ కేసి జాలిగా చూసి నవ్వుకున్నాడు.

రెండు రోజులు తర్వాత 'మహిళా సంఘ్' వాళ్ళు సుప్రసన్నకి చేసిన సన్మానమూ - తర్వాత చేయబడ్డ ఇంటర్వ్యూ వివరాలు అన్నీ ప్రముఖ దినపత్రిక నడిపే మహిళా పేజీలో ప్రచురించబడ్డాయి. ■